క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం

అల్లిపురం: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం సముపార్జించుకోవాలని రిసోర్స్ పర్సన్ పి.శ్రీనివాస్ సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయోగపడే స్వాతంత్ర సమరయోధుల చరిత్రలు, చందమామ, బొమ్మరిల్లు పుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదివి విశ్లేషించారు. గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ వీలైనంత సమయం గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు.

అలరించిన సంగీత విభావరి

అల్లిపురం: నటరత్న డాక్టర్ ఎన్.టి.రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని డాబాగార్డెన్స్ లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి కళాభిమానులను అలరించింది. స్వరాంజలి, స్వరార్చన సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావును ఎన్‌టీఆర్ సేవా పురస్కారంతో సత్కరించారు. జయమ్ము నిశ్చయమ్మురా పేరిట నిర్వహించిన కార్యక్రమంలో గీతాలు ఆహ్లాదాన్ని పంచాయి.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్, దొడ్డి రాంబాబు తదితరులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి శ్రీను మాట్లాడుతూ ప్రతి శనివారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు.

నేటి నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. పితాని దిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం పండగ చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగలవార ప్రధాన పండగ జరుగుతాయి.

- గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం పోలమాంబ పండగ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం జరపనున్నారు. ప్రధాన పండగ మంగళవారం రోజున భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. 23న మారువారం పండగ, వచ్చే నెల 4న ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అమ్మ ప్రేమ వెలకట్టలేనిది



పేద మహిళలకు చీరలు అందజేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి, రూపాకుల రవికుమార్

మహారాణిపేట: తల్లి ప్రేమ వెలకట్టలేనిదని రాజీవ్‌గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ అన్నారు. మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయ ఆవరణలో శ్రీగాయత్రి వెల్ఫేర్ కల్చర్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు, ప్రకృతి చికిత్సాలయం ఆధ్వర్యంలో శనివారం మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో తల్లిని మాతృమూర్తిగా గుర్తించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.మహేష్, ఎస్.చాతుర్య, క్షీరాబ్ధి దుతి, గేదెల శ్రీహరి, సిహెచ్.విజయలక్ష్మి, మంగ, రమణ, బంగారమ్మ, కొండమ్మ, గౌరీశంకర్ పాల్గొన్నారు.

జై భజరంగ భళి

- భక్తులకు కొండంత అండ ఆంజనేయుడు
- నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

ఆంజనేయుడంటే భక్తులకు కొండంత అండ. రెట్టించిన ధైర్యం. హనుమంతుడి గుండెల్లో శ్రీరామచంద్రుడు కొలువై ఉన్నట్టుగానే.. భక్తుల హృదయాల్లో భజరంగ భళి స్థానం పొందాడు. నాడు మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి రథంపై 'జెండాపై కపిరాజులా' ఉంటూ విజయ తీరాలకు చేర్చిన హనుమంతుడు.. నేడు ప్రతి ఊరిలో వెలిసి భక్తుల పాలిట ఆపద్బాంధవుడిలా పూజలందుకుంటున్నాడు. ఈ నెల 14న హనుమజ్జయంతిని పురస్కరించుకుని నగరంలో వెలసిన హనుమంతుని భారీ విగ్రహాల్లో కొన్నింటి విశిష్టత తెలుసుకుందాం.

– విశాఖపట్నం డెస్క్

శ్రీ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 27 అడుగులు
ప్రాంతం: మెయిన్ రోడ్డు, పూర్ణామార్కెట్
నిర్మాణ కర్తలు: దేవాలయ నిధులు, దాతలు
విగ్రహావిష్కరణ: 2006లో నాటి ఎమ్మెల్యే దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో ఆంజనేయ స్వామి స్వయంగా వెలిశాడని ప్రతీతి. భక్తుల పాలిట కల్పతరువుగా స్వామి పూజలు అందుకుంటున్నాడు.

సంజీవ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 30 అడుగులు, (గ్రౌండ్ లెవెల్ నుంచి 40 అడుగులు)
ప్రాంతం: హనుమంతవాక జంక్షన్
నిర్మాణ కర్తలు: జీవీఎంసీ
ప్రాముఖ్యత: విశాఖలో హనుమంతవాకకు ఎంతో ప్రత్యేకత, విశేష చరిత్ర ఉంది. నగరానికే తలమానికమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం కైలాసగిరి.. ఇక్కడి కొండ మీదే ఉంది. ఈ ప్రాంతానికి గుర్తింపుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనల మేరకు జీవీఎంసీ ఈ విగ్రహాన్ని నిర్మిస్తోంది.
ప్రారంభం ఎప్పుడంటే..?: ఈ విగ్రహం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పెయింటింగ్‌తో సహా మొత్తం పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించనున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 16 అడుగులు(గ్రౌండ్ లెవల్ నుంచి 21 అడుగులు)
ప్రాంతం: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్
నిర్మాణ కర్తలు: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్ వర్తక సంఘం సభ్యులు
విగ్రహావిష్కరణ: 1990లో విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: లారీ స్టాండ్ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వర్తక, వ్యాపారాల నిమిత్తం రాకపోకలు సాగించేటప్పుడు అభయాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేసి బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో వచ్చిన తర్వాత మళ్లీ ఆంజనేయ స్వామిని కొలుస్తారు. ప్రస్తుతం ఈ లారీ స్టాండ్‌ను షీలానగర్‌కు మార్చారు.

జింక్ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 45 అడుగులు
ప్రాంతం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జింక్ స్థలంలో..
నిర్మాణ కర్తలు: దేవదాయ శాఖ
విగ్రహావిష్కరణ: ఈ విగ్రహాన్ని 2006లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తండ్రి తిప్పల దయాల్‌రెడ్డి ఆవిష్కరించారు
ప్రాముఖ్యత : పారిశ్రామిక ప్రాంతంలో ఇదే ఎత్తయిన హనుమంతుడి విగ్రహం. గాజువాక ఆర్టీసీ డిపో ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి ముందు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగేవని.. ఆలయాన్ని నిర్మించి ప్రారంభించిన అనంతరం ప్రమాదాలు తగ్గాయని భక్తులు చెబుతున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 108 అడుగులు
ప్రాంతం: సీతమ్మధార కొండవాలు
నిర్మాణ కర్తలు: శ్రీ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు (ఎ.ఎస్.ఎన్.రాజు), దాతలు
విగ్రహావిష్కరణ: 2021 డిసెంబర్ 8న పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని సువిశాల సుందర ప్రదేశంలో నిర్మించిన 108 అడుగుల ఈ భారీ ఆంజనేయ విగ్రహం విశాఖలోనే అత్యంత పెద్దది.. ఎత్తయినది. ఆధ్యాత్మికంగా నగరానికి వన్నెతెచ్చింది.

మాతాభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 28 అడుగులు
ప్రాంతం: ఓల్డ్ డైరీ ఫారం జంక్షన్
నిర్మాణ కర్తలు: మాతాభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ పెద్ద, ధర్మకర్త బోను సత్యనారాయణ
విగ్రహావిష్కరణ: 2006లో ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: జాతీయ రహదారిపై పాత డైరీ ఫారం జంక్షన్‌లో వెలసిన మాతాభయ ఆంజనేయుడు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నాడు. విగ్రహ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ఇక్కడి స్వామిని కనులారా దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. చక్కని వాతావరణంలో ఆధ్యాత్మికతతో ఈ ప్రాంతం నిండి ఉంటుంది.

సుందర అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 46 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 57 అడుగులు)
ప్రాంతం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి
నిర్మాణ కర్తలు: ఆలయ కమిటీ సభ్యులు
విగ్రహావిష్కరణ: 1996 మార్చి 7న నాటి మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ దివంగత టి.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సుందర అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ నిర్మాణాన్ని 1991లో పెద్దాపురం ప్రాంతానికి చెందిన పిండి కృష్ణ అనే శిల్పి ప్రారంభించారు. మరుసటి ఏడాది ఆయన మరణించడంతో ఆ బాధ్యతను ఆయన అల్లుడు రాజ్‌కుమార్ తీసుకుని భారీ విగ్రహం, ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. నాడు నిర్మానుష్యంగా ఉండే తాటిచెట్లపాలెం ప్రాంతంలో ఆధ్యాత్మికంగా వెలుగొందేలా.. ఓ ల్యాండ్ మార్క్‌లా నిలిచేలా ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఎందరో భక్తులు ఇక్కడికి తరలివచ్చి అంజన్నను తిలకించి తరిస్తుంటారు.

నగరాభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



34వ వార్డు భూపేష్‌నగర్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ పద్మావతి



38వ వార్డు మాత వెంకటప్పయ్య వీధిలో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ విజయలక్ష్మి

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- నియోజకవర్గంలో రూ.75 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అల్లిపురం: నగరాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. నియోజకవర్గంలోని 34, 38 వార్డుల్లో రూ.75 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్లు తోట పద్మావతి, గోడు విజయలక్ష్మిలతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఆ వార్డుల్లోని బుక్కా వీధి, మాత వెంకటప్పయ్య వీధి, భూపేష్‌నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే బీచ్ రోడ్డు తదితర ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ పాతనగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జగదాంబ నుంచి పాత పోస్టాఫీస్ వరకు గల రహదారిని 60 అడుగుల రోడ్డుగా విస్తరించేందుకు సన్నద్ధమవుతున్నామని చెప్పారు. మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇప్పటికే టీడీఆర్‌లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు జగనన్నకు చెబుదాం అనే వినూత్న కార్యక్రమం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, సహాయ ఇంజినీర్, సచివాలయం కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, తాతబ్బాయి, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు





ముస్తాబైన అభయ హస్తాంజనేయ, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాలు

అల్లిపురం: హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు నియోజకవర్గంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ముఖ్యంగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయ అనుబంధ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం, అచ్చియ్యమ్మపేట అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయం, అల్లిపురం మెయిన్ రోడ్డులోని కోదండ రామస్వామి దేవస్థానం, నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం, వెంకటేశ్వరమెట్ట ఆంజనేయ స్వామి, పూతివారిమాన్యంలోని ఆంజనేయ స్వామి దేవాలయం మొదలగు ఆలయాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అరటి చెట్లతో దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. లక్ష తమలపాకుల పూజ, హోమాలు, అన్నసమారాధనలు జరపనున్నారు.

నేడు శ్రీఆంజనేయుడికి విశేష పూజలు

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని శ్రీఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఆదివారం హనుమత్ జయంతి నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, ఆకు, సింధూర పూజలు చేస్తున్నారు. రూ.216 చెల్లించిన భక్తుల పేరు, గోత్రనామాలతో స్వామివారికి పూజ నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.216 చెల్లించిన వారికి లడ్డు, పులిహోర, సింధూరం అందజేస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని చెప్పారు.

అంబికాబాగ్ రామాలయంలో..

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ జయంతి నిర్వహించనున్నారు. ఆంజనేయ స్వామికి ఉదయం 8 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన జరపనున్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.300 చెల్లించాలని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలాపన

అల్లిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ ఆలయ అనుబంధ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. గాయనీ గాయకులు ప్రైవేటు, సినీ భక్తి గీతాలను ఆలపించారు. వారిని ఆలయ గౌరవాధ్యక్షుడు పీలా వెంకట అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు, కోశాధికారి వాసుపల్లి నారాయణ ఘనంగా సత్కరించారు.

రాష్ట్రంలో నానాటికీ దిగజారుతున్న ప్రతిపక్షం



మన్యాల శ్రీనివాస్

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ నానాటికీ దిగజారుతోందని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రజలు రోజురోజుకూ దగ్గరవుతున్నారని, ఫలితంగా పార్టీ గ్రాఫ్ పెరుగుతుండటంతో ప్రతిపక్షాలు చేసేదేమీ లేక మంత్రులు, నాయకులను దూషించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఒక బీసీ మంత్రిపై పట్టాభి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆ పార్టీ అధికార ప్రతినిధితో బీసీ మంత్రిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. బీసీ మంత్రిపై పట్టాభి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని మన్యాల హెచ్చరించారు.

ఘనంగా ఫోరెన్సిక్ మెడిసిన్ వ్యవస్థాపక దినోత్సవం



విజేతకు బహుమతి అందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఫోరెన్సిక్ మెడిసిన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2020 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఫోరెన్సిక్ మెడిసిన్‌లో శ్రీ మాధవరావు మెమోరియల్ మెడల్ గెలుచుకున్న 2019 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థి ఎన్. హిమానీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ మమత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ షౌకత్ అలీ, డాక్టర్ వెంకట రమణ, ఇతర ఫ్యాకల్టీ, ఫోరెన్సిక్ మెడిసిన్ పీజీలు, 2020 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్క్రాప్ తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: ఎట్టకేలకు వన్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్క్రాప్ ఆక్రమణలు తొలగించారు. ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియం దరి జీవీఎంసీ జనతా బజార్‌లో ఉన్న స్క్రాప్ వ్యాపారులు రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ స్వయంగా వచ్చి పరిశీలించి స్క్రాప్ తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ వ్యాపారులు స్పందించకపోవడంతో ఈ నెల 12న 'అంతా వాళ్లిష్టమే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వన్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. శనివారం స్క్రాప్ తొలగించి రహదారులను క్లియర్ చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో పార్టీ నగర కార్యాలయం వద్ద నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి, స్వీట్లు తినిపించుకున్నారు. టపాసులు పేల్చి, పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు మాట్లాడుతూ కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి, అద్భుతమైన విజయం అందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాసరావు, బమ్మిడి గంగాధరరావు, గుత్తుల శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట వాసుదేవరావు, యువజన విభాగం నాయకుడు లక్కరాజు రామారావు, పార్టీ ఉపాధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోపై కర్ణాటక ప్రజల విశ్వాసం

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలపై కర్ణాటక ప్రజలు సంపూర్ణ విశ్వాసం ఉంచి ఆ రాష్ట్రంలో అగ్రప్రధాన నిలిపారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్జిపర్తి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్ర ప్రజలకు, పార్టీ కర్ణాటక కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాల సందర్శన



మహిళా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం ఆరిలోవ, పెందుర్తి ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాలు సందర్శించారు. శిక్షణ సమయంలో వారికి కావల్సిన మౌలిక వసతులతో పాటు భోజనం, తదితర వసతులపై కమిషనర్ ఆరా తీశారు. మహిళలు ఉత్తమ శిక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శిక్షణ పొందుతున్న ఏఎస్ఎంలకు సూచించారు. శిక్షణలో ప్రావీణ్యం పొంది ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సరకుల వితరణ



మహిళకు సరకులు అందిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: పేద కుటుంబానికి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, కార్పొరేటర్ డాక్టర్ మహ్మద్ సాధిక్ నిత్యావసర సరకులను అందజేశారు. జీవీఎంసీ 39వ వార్డుకు ఓ మహిళ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలియడంతో, వార్డు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సాధిక్ ఆమెకు సరకులను అందజేశారు. ఆపదలో ఉన్నవారికి సహాయం అందిస్తానని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

జగదాంబ: గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందింది. వివరాలిలా.. హార్బర్ పోలీస్ స్టేషన్ పరిధి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఆర్‌ఎస్‌ఎల్ కంపెనీ రోడ్డులో శుక్రవారం ఓ మహిళ ఎడమ కాలి మీదుగా గుర్తు తెలియని వాహనం వెళ్లిపోయింది. కాలు నుజ్జునుజ్జయి ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు గుర్తించారు. మృతురాలి వయసు 60 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 83310 41665, 99087 43614 నంబర్లకు కాల్ చేసి తెలియజేయాలని హార్బర్ పోలీసులు కోరారు.